జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 11-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 613 పేజీలు: 4 వెల : రూ.7

# కార్గో ఎయిర్‌పోర్టుకు.. అంగుళం భూమి కూడా.. ఇవ్వం

* మేం అభివృద్ధికి వ్యతిరేకం కాదు
* మరోచోట కట్టుకోండి
* ఎమ్మెల్యే శిరీషకు తేల్చి చెప్పిన రైతులు
* ఎయిర్‌పోర్టు వద్దంటూ నినాదాల మధ్య సాగిన సమావేశం
* సమావేశం మధ్యలో వెళ్లిపోయిన ఎమ్మెల్యే

**మందస, మార్చి 10(వార్త):** ఎయిర్ పోర్ట్ వద్దు.. ఉద్దానం భూములే ముద్దు.. అంటూ రైతులు నినాదాల మధ్య ఎంఎల్‌ఏ గౌతు శిరీషతో జరిగిన ప్రత్యేక సమావేశం ముగిసింది. మంగళవారం మందస మండలం రాంపురం గ్రామ సచివాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ఉద్దానంలో ఎయిర్ పోర్ట్ నిర్మిస్తే అభివృద్ధి జరుగుతుందని, నిరుద్యోగ సమస్య పరిష్కారం అందుతుందన్నారు. మీ భూములకి మంచి రేట్లు వస్తాయని, వలసలు తగ్గుతాయన్నారు. ఇదే సందర్భంలో పలువురు బాధిత రైతులు మాట్లాడుతూ మా పచ్చన ఉద్దానంలో ఒక్కఅంగుళం భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. మా తాతలు తండ్రులు ఇచ్చిన స్థిరాస్తి భూములు మేము కంటికి రెప్పలా కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. బాధిత రైతులుగా ఉన్న మేము కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ ద్వారా గత 18నెలలుగా ఎన్నో బహిరంగ సభలు ఏర్పాటు, చేసి ఎన్నో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మా డిమాండ్ చెప్పడం జరిగిందన్నారు. మేమంతా అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. పచ్చని ఉద్దానంలో తప్పించి జిల్లాలో మరో దగ్గర ఎయిర్ పోర్ట్ కట్టాలని కోరారు. బాధిత రైతులు మూకుమ్మడిగా ఒకేసారి మాకు ఎయిర్ పోర్ట్ వద్దు.. మా భూములే ముద్దు అంటూ నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే శిరీష సచివాలయంలో ఏర్పాటు చేసిన సభ నుంచి బయట వెళ్లిపోయారు. సమావేశంలో భేతాళపురం, రాంపురం, లక్ష్మీపురం, ఎం.గంగువాడ, టి.గంగువాడ, బిడిమి, టి.బిడిమి, కొత్త బిడిమి, శ్రీరామ్ నగర్ బాధిత రైతులు పాల్గొన్నారు.







# బ్యాంకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

* అంతర్రాష్ట్ర మోసగాడిని అరెస్టు చేసిన పోలీసులు
* వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద



**శ్రీకాకుళం క్రైం,మార్చి 10 (వార్త):** వివిధ ప్రాంతాల్లో నిరుద్యోగులకు బ్యాంకు ఉద్యోగాలు ఇప్పిస్తానని, తక్కువ ధరకు స్థలాలు కొనిపెడతానని నమ్మ బలికి కోట్ల రూపాయలు మోసం చేసిన అంతర్రాష్ట్ర నిందితుడిని శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన గొల్ల బెనర్జీ అలియాస్ హర్షవర్ధన్ రెడ్డి (33) సుమారు రూ.1 కోటి 5 లక్షల వరకు మోసం చేసినట్టు మంగళగిరిలోని సీఐడీ కార్యాల యంలో నందిగాం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన దేశెట్టి రమణమూర్తి (46) ఫిర్యా దు చేశారు. ఆ ఫిర్యాదును సీఐడీ విశాఖపట్నం అధికారులు విచారించి తమ ఎంక్వైరీ రిపోర్టును సీఐడీ డీజీకి పంపించారు. అనంతరం డీజీ సీఐడీ తదుపరి చర్యల కోసం ఆ ఫిర్యాదును శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి పంపించారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, శ్రీకాకుళం రూరల్ ఇన్స్పెక్టర్ కె. పైడపునాయుడు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొల్ల బెనర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు. బెనర్జీ ఇంటర్ వరకు చదివి, తరువాత సీఏ కోర్సుల్లో చేరి మధ్యలోనే మానేసి అకౌంట్స్‌పై కొంత పరిజ్ఞానం సంపాదించాడు. మొదట నెల్లూరులో సురేఖ అనే మహిళను వివాహం చేసుకుని ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత ఆమెను విడిచిపెట్టేవాడు. అనంతరం శ్రీకాకుళం జిల్లా గార మండలం సతివాడ గ్రామానికి చెందిన అంబటి నాగమణిని వివాహం చేసుకుని అరసవెల్లిలో నివాసమున్నాడు. అక్కడ తన ఇంటి యజమాని దేశెట్టి రమణమూర్తితో పరిచయం పెంచుకుని, తాను ఢిల్లీలో సెంట్రల్ జోనల్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నానని, ఇటీవల విశాఖపట్నం రీజియన్‌కు ట్రాన్స్ఫర్ అయ్యానని అబద్ధంగా చెప్పాడు. అలాగే తాను పలు బ్యాంకుల రిక్రూట్మెంట్ బోర్డులో మెంబర్‌నని చెప్పి ఎస్‌బీఐ బ్యాంకులో బ్యాక్లాగ్ పోస్టుల కింద పీవోలు, క్లర్క్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఒక్కో ఉద్యోగానికి రూ.6 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ కడితే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ విధంగా చుట్టుపక్కల వ్యక్తుల నుండి సుమారు రూ.36 లక్షలు వసూలు చేసి వారికి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ కాపీలు ఇచ్చాడు. అంతేకాకుండా శ్రీకాకుళం చిన్నబజార్ రోడ్‌లో 8 సెంట్ల స్థలం ఆక్షన్‌కు వస్తుందని, తన పరిచయాలతో తక్కువ ధరకు ఇప్పిస్తానని ఫిర్యాదుదారుని నమ్మబలికి సుమారు రూ.86 లక్షలు తీసుకున్నాడు. ఇంకా రూ.29 లక్షల విలువ గల గోల్డ్ క్రాఫ్ట్ మెషీన్‌ను రూ.14 లక్షలకే ఇప్పిస్తానని చెప్పి కూడా డబ్బులు తీసుకుని ఎటువంటి వస్తువు ఇవ్వకుండా మోసం చేశాడు. శ్రీకాకుళం జిల్లాలో తన మోసం బయటపడటంతో నిందితుడు విశాఖపట్నం, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు వెళ్లి అక్కడ కూడా నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేశాడు. విశాఖపట్నంలో 8 మందిని, తిరుపతిలో ముగ్గురిని, అలాగే నెల్లూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో కూడా పలువురిని మోసం చేసి గత మూడు సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. నిందితుడిపై నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసులు, ఒక కొట్లాట కేసు, ఏ.ఎస్.పేట పోలీస్ స్టేషన్‌లో ఒక చీటింగ్ కేసు, అలాగే తాడేపల్లిగూడెం, తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో మరో చీటింగ్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ అంతర్రాష్ట్ర నిందితుడిని శ్రీకాకుళం రూరల్ ఇన్స్పెక్టర్ కె. పైడపునాయుడు, సబ్-ఇన్స్పెక్టర్ కె. రాము అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు చెప్పడంతో జైలుకు తరలించినట్టు డీఎస్పీ వివేకానంద తెలిపారు.

### వైద్యాధికారి రవి కుమార్‌పై..
# ఏఎన్ఎం భర్త దాడి

* పోలాకి పీఎస్‌లో వైద్యాధికారి ఫిర్యాదు
* దాడిని ఖండించిన వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు



**పోలాకి, మార్చి 10(వార్త):** పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టేషన్ అధికారి నల్లి రవికుమార్‌పై ఏఎన్ఎం భర్త దాడి చేసిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం పోలాకి పీహెచ్సీలో ఆశా కార్యకర్తలతో నల్లి రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో ఏఎన్ఎం కమల భర్త కరిమి శ్రీనివాసరావు అకస్మాత్తుగా వచ్చి రవికుమార్‌పై దాడి చేశారు. దీంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన రవికుమార్‌ను మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు పోలాకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఉత్తమ వైద్యాధికారిగా పేరు పొందిన వైద్యుడిపై అకారణంగా దాడి చేయడం పట్ల వైద్యసిబ్బందితో పాటు కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆశా వర్కర్లు కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.



# రెవెన్యూ రికార్డుల రగడ!

* వారసత్వ వాటాలో అధికారుల కోత..
* అన్నదమ్ముల మధ్య చిచ్చు
* మందస కార్యాలయంలో 'మాయాజాలం'
* బాధితుల ఆవేదన

**మందస, మార్చి 10(వార్త):** మందస మండల రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలు సామాన్యులకు కన్నీటిని మిగిలిస్తున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెడుతున్న ఈ రెవెన్యూ మాయాజాలం వెనుక క్షేత్రస్థాయి అధికారుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. పిత్రార్జితంగా వచ్చిన 3.60 ఎకరాల భూమిలో మేనత్తకు కేటాయించిన 50 సెంట్లు పోగా, మిగిలిన 3.10 ఎకరాలను ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రీ-సర్వే ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులు, ఒకరికి పట్టం కట్టి మిగిలిన వారిని రోడ్డున పడేశారు. కోడ తేజేశ్వరరావు ఒక్కరికే ఏకంగా 2.45 ఎకరాల భూమిని కట్టబెడుతూ రికార్డులు సృష్టించడం వెనుక పెద్ద ఎత్తున డబ్బులు 'చేతులు' మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు కుటుంబంలో పెద్దవాడైన కోడ కోదండరావుకు దక్కాల్సిన ఒక్క సెంటు భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేయకపోవడం గమనార్హం. 2009లోనే ఆయన మరణించడంతో, ఇప్పుడు ఆయన వారసులు తమకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరొక సోదరుడు కోడ కృష్ణారావుకు కేవలం 51 సెంట్లు మాత్రమే కేటాయించి, మెజారిటీ భూమిని ఒకే వ్యక్తికి దఖలు పరచడం ద్వారా రెవెన్యూ చట్టాలను అపహాస్యం చేశారు. అధికారుల పొరపాట్లు లేదా ఉద్దేశపూర్వక తప్పిదాల కారణంగా దశాబ్దాలుగా కలిసి ఉన్న కుటుంబాల్లో ఆస్తి తగాదాలు మొదలవుతున్నాయి. తమకు జరిగిన అన్యాయాన్ని ఆధారాలతో సహా వివరించిన బాధితులకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నుంచి విస్తుపోయే సమాధానాలు ఎదురవుతున్నాయి. "పొరపాటున పాస్ బుక్కులు ఇచ్చేశాం.. ఇప్పుడు మేమేం చేయగలం?" అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానమివ్వడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. పైగా బాధితులను కోర్టులకు వెళ్లమని సూచిస్తూ, భూమిని ఆక్రమించుకుని పొజిషన్‌లోకి వెళ్లమని ఉచిత సలహాలు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది పడుతున్న కష్టాల గురించి బాధితులకు వివరిస్తూ, తమ చేతుల్లో ఏమీ లేదంటూ చేతులెత్తేయడం విచారకరం.




### చర్యలు తీసుకోవాల్సిందే!

జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి, రికార్డులు బ్లాక్ లిస్టులో ఉన్నప్పటికీ, అక్రమంగా మ్యుటేషన్లు చేసిన విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గణపతి, సర్వేయర్ మైలపిల్లి ప్రశాంత్ పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు మార్చడమే కాకుండా, బాధితులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న మందస తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై విచారణ జరిపి, తమ భూమిని తమకు దక్కేలా చూడాలని కోరుతున్నారు. న్యాయం జరగని పక్షంలో ఉన్నతాధికారుల కార్యాలయాల ముందు నిరసనకు దిగుతామని బాధితురాలు సంధ్యారాణి హెచ్చరిస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## స్వచ్ఛ సర్వేక్షన్‌లో అందరూ భాగ్యస్వాములు కావాలి

**పలాస, మార్చి 10 (వార్త):** స్వచ్ఛ సర్వేక్షన్ లో అందరూ భాగ్యస్వాములు కావాలని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గం శివసాగర్ బీచ్ సముద్ర తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరువేత, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్-2026 లోఎంపిక కాబడినందున బుధవారం ఉదయం 7.00 గంటలకు పలాస మున్సిపల్ సిబ్బంది, గ్రీన్ ఆర్మీ, ఎన్ సి సి శివసాగర్ బీచ్ పర్యవేక్షణ సభ్యుల ఆధ్వర్యంలో జరిగే ఈ ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషచే ప్రారంభించబడునని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2026 లో భాగంగా ఈ పలాస-కాశీబుగ్గ కోస్టల్ ప్రాంతం ఎన్నిక కావడం ఆనంద దాయకంగా ఉందని, ఈ కార్యక్రమంలో మండల అధికారులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మెడిటేషన్‌తో శారీరక, మానసిక ప్రశాంతత



**పలాస, మార్చి 10 (వార్త):** మెడిటేషన్ తో శారీరిక, మానసిక ప్రశాంతత లభిస్తుందని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనర్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, విజయవాడ ఆదేశాల మేరకు పలాసలో గత పది రోజులుగా నిర్వహించిన మెడిటేషన్, యోగా కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముసింది. ఈ సందర్భంగా యోగా, మెడిటేషన్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా మానసిక ప్రశాంతతను పెంచడానికి చాలా సమర్థవంతమైన సహజ మార్గం. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మనసును శాంతపరుస్తుందని తెలిపారు. మెడిటేషన్ విద్యార్థులకు శారీరకంగా ఒత్తిడి తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది, మానసికంగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని చెప్పారు. యోగా, మెడిటేషన్ చేయడం వల్ల విద్యార్థులకు కలిగే శారీరక, మానసిక లాభాలతో పాటు ఆందోళన ఒత్తిడి భయం ఎలా పోగొట్టుకోవాలి, సెమిస్టర్ ఎగ్జామ్స్ లో ఒత్తిడి లేకుండా మంచి విజయాలు సాధించవచ్చని, మానసిక ప్రశాంతత పొందవచ్చని సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామికి మామిడి పూజలు



**హిరమండలం, మార్చి10(వార్త):** పాత హిరమండలంలోని అభయాంజనేయ స్వామి వారి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పాల్గొని, స్వామి వారికి పూజలు జరిపారు. అన్నదాన కార్యక్రమానికి రూ.10,000లు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను కాపాడే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు లభించి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## రానున్న విద్యా సంవత్సరం నుంచే కేంద్రీయ విద్యాలయం తరగతులు



**పలాస, మార్చి 10 (వార్త):** రానున్న విద్యా సంవత్సరం నుంచి పలాస రైల్వే పాఠశాల భవనాల్లో కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించేందుకు జరుగుతున్న పనులను మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి ఎనలేనిదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే అడ్మిషన్లు జరుగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అప్పలరాజు, తహసీల్దార్ టి.కళ్యాణ్‌చక్రవర్తి, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ ఛైర్మన్ మల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు లోడగల కామేశ్వరరావు, పట్టణ టీడీపీ కార్యదర్శి సప్ప నవీన్, గాలి కృష్ణారావు, చెల్లూరు రామక్రిష్ణ, కొత్త సత్యం, మల్లిపెద్ది చిన్ని, సవర రాంబాబు, డొక్కరి శంకర్, దడియాల నర్సింగులు, కొండె నర్సింగ్, జోగ మల్లి, రవిశంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## రూ.3కోట్లతో 12 ఉద్దానం గ్రామాలకు తారురోడ్డు



**మందస, మార్చి 10(వార్త):** మందస మండలంలోని ఓల్డ్ ఎన్ హెచ్5 రోడ్డు కొర్రాయి గేట్ నుంచి సరియపల్లి పంచాయతీ సుమారు 12 గ్రామాలు కలుపుతూ బీటీ రోడ్డు మంజూరైన పనులు శర వేగంగా జరుగుతున్నాయని క్లస్టర్ కోకన్వీనర్ అడ్డి ఈశ్వరరావు తెలిపారు. హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.3కోట్లతో బీటీ రోడ్డు జరుగుతోందన్నారు. గత కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారిందన్నారు. రవాణా సౌకర్యాలకు చాలా ఇబ్బందికరంగా ఉండడంతో రోడ్డు విషయంలో గత ప్రభుత్వంలో పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు రకాలుగా విమర్శలకి గురి చేశారన్నారు. ప్రజల్లో ఒక అబద్ధపు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల కాలంలోనే శాసన సభ్యురాలు ఎమ్మెల్యే గౌతు శిరీష పుణ్యమా అంటూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట కొరకై, ఉద్దానం గ్రామ పంచాయతీ రోడ్లకు నిధులు మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, శిరీషకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి



- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- పలు వార్డుల్లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆకస్మిక తనిఖీలు

**శ్రీకాకుళం, మార్చి 10(వార్త):** నగరంలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచడమే ధ్యేయంగా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించిన ఆయన, సిబ్బంది పనితీరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా బైరవానిపేట రోడ్డు ప్రాంతంలో పర్యటించి, అక్కడ మురుగు కాలువల పరిస్థితిని, వ్యర్థాల తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా కమిషనర్ గూన పాలెం, ఎల్బీఎస్ కాలనీ పార్క్, కాకి వీధి సచివాలయ పరిధిలోని ప్రాంతాలను సందర్శించారు. అబ్దుల్ కలాం నగర్‌లో పర్యటించిన సమయంలో






వీధుల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రం చేయాలని, దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి ఏరియా సచివాలయాల పరిధిలో పారిశుధ్య సిబ్బంది హాజరును, వారు నిర్వహిస్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి వార్డులోనూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ఆయన స్పష్టం చేశారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి


- చీఫ్ ఇంజనీర్‌కు మాదిన రామారావు వినతి

-విజయవాడలో కలిసిన టిడిపి నాయకులు



**కంచిలి, మార్చి 10(వార్త):** కంచిలి, కవిటి మండలాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్త య్యేలా చూడాలని కంచిలి మండల టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు తో పాటు పలువురు టీడీపీ నాయకులు విజయవాడలో పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ను కలసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం చీఫ్ ఇంజనీర్ తో కలిసి రోడ్లకు సంబంధించిన వివరాలను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ప్రతిపాదించిన ఇటువంటి ముఖ్యమైన రహదారులను వెంటనే అభివృద్ధి చేసేందుకు తగు సహాయ సహకారాలు అందించాలని కోరారు. చీఫ్ ఇంజనీర్ కు అందించిన వివరాల మేరకు రోడ్ల పరిస్థితులు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి పెద్దకొదిరియా వరకు 81 లక్షల రూపాయలు, జాతీయ రహదారి నుంచి చిన్నకొద్దిరియా వరకు 136 లక్షలు, జాతీయ రహదారి నుంచి గొల్ల పుట్టుక వరకు 70 లక్షలు, జాతీయ రహదారి నుంచి కమలాయిపుట్టుగా వరకు 11 1లక్షలు, జాతీయ రహదారి నుంచి లండ పుట్టుక వరకు 89 లక్షలు, జాడపూడి రైల్వే క్యాబిన్ నుంచి బసవ పుట్టుక వరకు 73 లక్షలు, జాతీయ రహదారి నుంచి పాత్ర పడవరకు 50 లక్షల రూపాయల అంచనాతో నిర్మాణం కానున్న రహదారులు అసంపూర్తిగా మిగిలి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో అప్పటినుంచి ఇప్పటివరకు అనేక ఇక్కట్లతో ప్రజలు ఇటువంటి రహదారులపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా దయ తలచి ప్రతిపాదించిన రోడ్ల అభివృద్ధికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డ హరిబాబు, బొడ్డ కిరణ్ కుమార్, పాసర్ల కృష్ణ పాల్గొన్నారు.

## గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత



**బూర్జ, మార్చి10(వార్త):** చీడివలసలో రూ.1.02 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, కాలువలు వంటి మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ గ్రామంలో గత ప్రభుత్వ కాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తక్కువ కాలంలోనే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం ఈ గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనేపు రామకృష్ణ, నగరాల డైరెక్టర్ పిల్లా కన్నంనాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఎంసీ భవనం ఆధునికీకరణకు రూ. 3.20కోట్లు

-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపిన కోటబొమ్మాళి ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు తదితరులు

**శ్రీకాకుళం / నిమ్మాడ, మార్చి10(వార్త):** కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) భవనం ఆధునికీకరణతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో రూ. 3 కోట్లు 20 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల కోటబొమ్మాళి ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, మార్కెట్ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంగళవారం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ భవనాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడం వల్ల రైతులకు, వ్యాపారులకు మరింత సౌకర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఛైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ.55 లక్షలు కేటాయించగా, ప్రహరీ గోడ నిర్మాణం, గేట్ల ఏర్పాటు కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యాలయ భవనం ఆధునికీకరణకు రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. చీపుర్లపాడు వద్ద కొత్త మార్కెట్ యార్డు మంజూరు చేయడంతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి రూ.90 లక్షలు కేటాయించడం విశేషమని అన్నారు. మొత్తంగా రూ.3 కోట్లు 20 లక్షల నిధులు మంజూరు కావడం ద్వారా కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ మరింత బలోపేతం అవుతుందని, రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీల అభివృద్ధి రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పెద్దలంబ పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్



**సారవకోట, మార్చి 10(వార్త):** విద్యార్థులు పోటీ పరీక్షల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఎంఈఓలు ఎం.వి. రమణ, భూ లక్ష్మి కోరారు. మంగళవారం సారవకోట మండలం పెద్దలంబ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందించేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహించడం అవసరమని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు సాధించగలరని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను పి.జ్ఞానేశ్వర్, దినేష్‌కుమార్, ఎస్.మణి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన పంచాగం ఆవిష్కరణ



**అరసవల్లి, మార్చి 10(వార్త):** అరసవల్లిలోని ఆదిత్యుని ఆలయంలో నూతన పంచాంగాన్ని మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సుబ్రహ్మణ్యం శర్మ, మండల విప్ వేపాడ చిరంజీవి భార్య నివేదిత, ఆలయ అర్చకులు, వేద పండితులు, కార్య నిర్వహణాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

## పోలాకి పాఠశాలలో విజ్ఞాన వారోత్సవాలు



**పోలాకి, మార్చి 10(వార్త):** పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విజ్ఞాన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి క్విజ్, సెమినార్ పోటీలలో ఈదులవలస పీఎం శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అభినందిస్తూ మరింత శ్రద్ధగా సిద్ధమై జిల్లాస్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇటుకల బట్టీ కార్మికులకు వైద్య పరీక్షలు

**ఇచ్ఛాపురం, మార్చి 10 (వార్త):** ఈదుపురం, లోద్దపుట్టి గ్రామాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ పి.పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. బ్రిక్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న కార్మికులు, వారి పిల్లలకు వైద్య పరీక్షలు జరిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో 252 మందిని పరీక్షించారు. 165 మందికి వివిధ టెస్టులు నిర్వహించి, మందులను అందించారు. 48 మంది చిన్నారుల్లో పోషకాహార లోపం గుర్తించి, మందులను అందించారు. కార్యక్రమంలో మెడికల్, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 12న వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం



**నరసన్నపేట, మార్చి 10(వార్త):** ఈ నెల 12న (గురువారం) జిల్లావ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండుగలా నిర్వహించాలని మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గడిచిన 15 సంవత్సరాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగిందని తెలిపారు. ముఖ్యంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పార్టీ చెరగని ముద్ర వేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ దాడులను ధైర్యంగా ఎదుర్కొంటూ పార్టీ ముందుకు సాగుతోందని ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామం, వార్డు, మండల మరియు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించాలని ఆయన కోరారు.

# వేసవి సమస్యలపై పకడ్బందీ చర్యలు

### -జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



**శ్రీకాకుళం, మార్చి 10(వార్త):** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి మండలంలో వారం వారం సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఎండల తీవ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఉపాధి హామీ పనుల వద్ద కూలీల కోసం మంచినీరు, నీడ నిమిత్తం షేడ్ నెట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వడదెబ్బపై ఉపాధ్యాయుల ద్వారా అవగాహన కల్పించాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ ఏడాది 'జీరో హ్యూమన్, యానిమల్ లాస్' సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి అధికారులతో మాట్లాడిన ఆమె, 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ – 2026' ను ఆవిష్కరించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం పని ప్రదేశాల్లో పనులు నిర్వహించకుండా పనివేళలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. పశువుల కోసం గ్రామాల్లోని నీటి తొట్టెలను నిరంతరం నింపాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అత్యవసర సాయం కోసం 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి. లక్ష్మణ మూర్తి, విపత్తుల నియంత్రణ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాము, సబ్ డి.ఎఫ్.ఓ నాగేంద్రరావు, పశుసంవర్ధక శాఖ జె.డి. రాజగోపాల్, వైద్య ఆరోగ్య శాఖ నుంచి డాక్టర్ శివరంజని, కలెక్టర్ కార్యాలయ డి-సెక్షన్ సూపర్ రామ్మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## సారవకోటలో విజ్ఞాన వారోత్సవాలు



**సారవకోట, మార్చి 10(వార్త):** సారవకోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వెంకటరమణ, కే.భూలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్విజ్, డిబేట్, విజ్ఞాన ప్రదర్శన వంటి పలు కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహించారని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి



**ఇచ్ఛాపురం మార్చి 10 (వార్త):** శ్రీకాకుళంలో ఉన్న పెంతుకోస్తల్ చర్చి దైవ సేవకులందరూ మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు, భవిష్యత్ ప్రణాళిక భాగముగా ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక ఆహ్వానితులు, ముఖ్య అతిథిగా డా.ప్రత్తి అన్వేష్ ( వై ఎస్ ఆర్ సి పి స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి) పాల్గొని రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లుటకు సలహాలు, సూచనలు అందించారు. అనేకమంది దైవ సేవకులు పాల్గొని ప్రార్థన జరిపారు.

## కరవంజ మోడల్ స్కూల్లో విజ్ఞాన వారోత్సవాలు



**జలుమూరు, మార్చి 10(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విజ్ఞాన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ బమ్మిడి మాధవరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. మంగళవారం జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్లో నిర్వహించిన విజ్ఞాన వారోత్సవాల్లో మూడు నుంచి 8వ తరగతుల వరకు ఉన్న విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి మొత్తం 35 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో నుంచి ఆరుగురిని ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశంగా ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్య అందించడంపై దృష్టి



**నరసన్నపేట, మార్చి 10(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. మంగళవారం నరసన్నపేటలోని పీఎం శ్రీ జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న వారోత్సవాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల మేధస్సు, ప్రతిభను వెలికితీయడానికి క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. అలాగే విద్యార్థుల విజ్ఞానాన్ని ప్రదర్శించేలా విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో మొత్తం 56 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఎంఈఓ తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక , విజ్ఞాన ఆధారిత విద్యను అభివృద్ధి చేయడం పాఠశాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## 10 వ వార్డులో పారిశుధ్య కార్యక్రమం

**పలాస, మార్చి 10 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డు లో ఉన్న కాశీగుండం, చక్ర గుండం, దేశిబట్టి ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ యంత్రాంగం మంగళవారం తొలగించారు. పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, గౌతు శిరీష జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఐ. శ్రీనివాసులు, కూటమి నాయకులు సమన్వయంతో జనసేన యూత్ లీడర్ శ్రీకాంత్, బీజేపీ పాలవలస వైకుంఠ రావు ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే మన నాయకులకు అభినందనలు తెలిపారు.



## ఉదయ్ కుటుంబానికి
## రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



**పోలాకి, మార్చి 10(వార్త):** నరసన్నపేట మండలం మాకివలస గ్రామానికి చెందిన రావాడ ఉదయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయనకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడంతో వర్తించే ప్రమాద బీమా కింద రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మంగళవారం ఉదయం పోలాకి మండలం మబగాంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మృతుడి తండ్రి రమణయ్యకు బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అలాగే ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి యాళ్ళ వేణుగోపాలరావు, తాడేల కోటి బాబు, శివాల అనిల్, గంగు చలపతిరావు, సింహాచలంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**పోలాకి, మార్చి 10(వార్త):** సారవకోట మండలం అవలంగి గ్రామానికి చెందిన తంబిడి లక్ష్మీనారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.57,522 (యాభై ఏడు వేల ఐదు వందల ఇరవై రెండు రూపాయలు) విలువైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య చికిత్సలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, బుడితి సర్పంచ్ పొన్నాన శంకరరావు, లక్ష్మీపురం సర్పంచ్ పొదిలాపు కృష్ణారావు, సారవకోట పిఎసిఎస్ డైరెక్టర్ బోర ధనుంజయ్తో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటీఎంల్లో నగదు కొరత తీర్చండి

**ఇచ్ఛాపురం, మార్చి 10 (వార్త):** బ్యాంకులో నిధుల కొరత ఎటిఎంలలో నగదు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు పై ఆలయన్స్ క్లబ్ సభ్యులు పిర్యాదు చేసారు. అన్ని ప్రధాన బ్యాంక్ మేనేజర్ లకు వినతిపత్రాలు అందజేశారు. బ్యాంకు ఎటిఎంలలో తగినంత నిధులు ఉంచి నగదు లావాదేవీలు సులభతరం చేయవలసిందిగా కోరారు. నగదు కొరత ఎటిఎంలలో డబ్బు అందుబాటులో లేకపోవడం వలన వినియోగదారులు సాధారణ ప్రజలు వారి రోజువారీ జీవనంలో నగదు లావాదేవీలు చేయడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దృష్టికి తీసుకుని వచ్చారు. గత కొద్దీ రోజులుగా ఎటిఎంలు పనిచేయకపోవడం వల్ల లేదా వాటిలో నగదు అందుబాటులో లేకపోవడం వల్ల వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా చిన్నచిన్న వ్యాపారులు మరియు దినసరి అవసరాల కోసం నగదు చెల్లింపులు చేయాల్సిన ప్రజలు చాలా కష్టాలను ఎదుర్కొంటున్నారని. దయచేసి బ్యాంకులోను ఎటిఎంలలోను తగినంత నిధులు అందుబాటులో ఉంచి వినియోగదారులు సులభంగా నగదు ఉపసంహరించుకొని లావాదేవీలు చేయగలిగేలా చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. ఎందుకంటే డిజిటల్ చెల్లింపులు ప్రతి చోటా అందుబాటులో ఉండవు. అందువల్ల ఎటిఎంలలో నగదు అందుబాటులో ఉండటం ప్రజలకు నగదు లావాదేవీలు చేయడానికి ఎంతో అవసరమన్నారు.



# పేదలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

### -ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం
### - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం / నిమ్మాడ, మార్చి10(వార్త):** రాజకీయాలకు అతీతంగా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు 9 మంది లబ్ధిదారులకు రూ. ఏడు లక్షల 50 వేలు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధి దారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సహాయం పొందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

### లబ్ధిదారుల వివరాలు

కోటబొమ్మాళి మండలం చిన్నసానకు చెందిన బి.వరదరాజుకు 77,090, కోటబొమ్మాళి మండలం పట్టుపురంనకు చెందిన పి.మల్లేశ్వరరావుకు రూ.51,245, కె.అప్పారావుకు రూ.32,551, తాటిపత్రికి చెందిన టి.సింహబాలుడుకు రూ.41,729, నందిగాం మండలం కొత్తపేటకు చెందిన నీలవేణికి రూ.41,729. సంతబొమ్మాళి మండలం వడ్డివాడకు చెందిన ఎన్.శ్రీరాములుకు రూ.31,843, పుక్కలవానిపేటకు చెందిన కె.సరస్వతికి రూ. 60,848, సంతబొమ్మాళి మండలం వద్దవాడకు చెందిన ఎల్.శ్రీనివాసరావుకు రూ.1,12,141ల చెక్కులు అందజేశారు.

# ఉత్తమ మహిళా ఎంటర్‌ప్రైనర్లకు సన్మానం



**మందస, మార్చి 10(వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతీ కుటుంబం నుంచి ఒక ఎంటర్ప్రైనర్ ను తయారు చేసే ఉద్దేశంతో ఉత్తమ మహిళా ఎంటర్ప్రైనర్ లను, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యకు గతంలో సేవలు అందించిన మహిళలను ఘనంగా సన్మానిచ్చారు. మందస పట్టణంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూర్మారావు మాట్లాడుతూ మహిళలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ఆధారంగా తీసుకున్న రుణాలను సద్వినియోగ పరుచుకోవడం, ఆదాయాభివృద్ధికి కావలసిన ఆస్తులను కొనుక్కోవడం తద్వారా ప్రతి ఒక్కరూ ఎంటర్ప్రైనర్ కావాలన్న సంకల్పంతో ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తున్నట్లు ఆయన వివరించారు. స్థానిక మండల సమాఖ్య పాలక వర్గ సమావేశంలో పాల్గొని మహిళా ఎంటర్ప్రైనర్ లను ఉద్దేశించి మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య కు గతంలో సేవలు అందించిన కృష్ణ కుమారిని ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయి సమావేశం లో మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళా ఉద్యోగులను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ నారీ సిఆర్పిలు, వి.ఓ.ఏ.లను సన్మానించడం జరిగిందని ఆయన తెలిపారు. మండల స్థాయిలో నలుగురు బెస్ట్ ఎంటర్ప్రైనేర్లను గుర్తించి, సన్మానం చేసినట్లు వివరించారు. సువర్ణాపురం శ్రీ ఆంజనేయ స్వయం శక్తి సంఘం తెప్పల చేమంతి గ్రామసంఘం ద్వారా స్త్రీనిధి, బ్యాంకు ద్వారా రుణాలు పొంది ఆటో ద్వారా మొబైల్ ఫాన్సీ, కిరాణా గృహోపకర వస్తు వ్యాపారంలో నెలకు 20 వేలకు పైగా ఖర్చులు పోనూ ఆదాయం సంపాదిస్తూ నలుగురు మహిళలు కు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. సిరిపురం గ్రామంలో వెన్నెల స్వయం సహాయక సంఘం నగరి పుష్పలత బట్టల దుకాణాన్ని నిర్వహిస్తూ ఇద్దరు వ్యక్తులకు ఉపాధి కల్పిస్తున్నారని, కుసుమల గ్రామ సంఘం నుంచి సవర పద్మావతి పేపర్ ప్లేట్ తయారు చేస్తూ ఇతర మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. వీరభద్ర గ్రామం నుంచి బి.శారద గాజులు, కిరాణా దుకాణాలు నడుపుతూ నలుగురుకు ఆదర్శం గా నిలుస్తున్నందున మండల సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎం. ఆధ్వర్యంలో వారికి దుశ్శాలువలను కప్పి, పుష్పగుచ్ఛం, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, మండల సమాఖ్య ప్రతినిధులతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పదో తరగతి పరీక్షల్లో శతశాతం సాధించాలి

**పలాస, మార్చి 10 (వార్త):** పదో తరగతి పరీక్షల్లో శతశాతం సాధించాలని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలగాన హేమారావు విద్యార్థులను సూచించారు. మంగళవారం రాత్రి వజ్రపు కొత్తూరు మండలంలోని, నగరంపల్లి - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శివరాం పురం, గుల్లలపాడు, నగరంపల్లి, వజ్రపుకొత్తూరు గ్రామాలలోని విద్యార్థుల ఇల్లను సందర్శించారు. వారి తల్లిదండ్రులను కలిసి మార్గదర్శనం చేసారు. శతశాతం ఉత్తీర్ణత, ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా కృషి చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, చింత ఉమారావు, వై.కాళిదాసు, జే.నారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.



## కొండలోగాంలో గ్రానైట్ క్వారీలపై అధికారుల దర్యాప్తు

### -క్వారీలను నిలిపివేయాలని గిరిజనుల డిమాండ్



**మందస, మార్చి 10(వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాం సమీపంలో గల గ్రానైట్ క్వారీలపై అధికారులు దర్యాప్తు నిర్వహించారు. గ్రానైట్ క్వారీలతో గిరిజనులకు నష్టం కలుగుతోందని గిరిజన శక్తి సంక్షేమ సంఘం పీజీఆర్ఎస్లో ఫిర్యాదు చేసింది. దీంతో టెక్కలి నుంచి గనులశాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో గిరిజనులు మాట్లాడుతూ క్వారీల నుంచి శబ్ద, వాయు కాలుష్యం వెలువడుతోందన్నారు. పంటలకు నష్టం కలుగుతోందని, సమీపంలోని నివాస గృహాల గోడలు బీటలు వారుతున్నాయన్నారు. క్వారీల నిర్వహణపై ఫిర్యాదులు ఉండడంతో రహస్యంగా రాత్రివేళల్లో భయంకరమైన శబ్ధాలతో నిర్వహణ కొనసాగిస్తున్నారన్నారు. దీంతో శబ్ద కాలుష్యానికి రాత్రి వేళల్లో నిద్ర పట్టడంలేదని, చిన్నారులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణమండలి అనుమతులు పొందామని నిర్వహకులు చెబుతున్నారన్నారు. క్వారీ నుంచి జమ చేసిన సీనరేజ్ నిధులు కూడా కొండలోగాం పంచాయతీకి రావడంలేదన్నారు. గ్రానైట్ క్వారీలతో గిరిజనులకు జరుగుతున్న నష్టాలను పరిగణలోకి తీసుకుని, తక్షణమే క్వారీలను రద్దు చేయాలని అధికారులకు కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

## రామ్మోహన్ నాయుడిపై విమర్శలు తగవు

### - బగ్గు రమణమూర్తి

### - వైసీపీ నేతల వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే

**పోలాకి, మార్చి 10(వార్త):** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు సరికాదని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ విమర్శలు చేయడం తగదని ఆయన మండిపడ్డారు. మంగళవారం పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో మాట్లాడిన ఆయన, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిపై కొందరు వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జిల్లాకు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం నుంచి "యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డు" అందుకున్న రామ్మోహన్ నాయుడు సిక్కోలు జిల్లాకు జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాంటి నాయకుడు జిల్లాకు దొరకడం ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి రామ్మోహన్ నాయుడు కీలకపాత్ర పోషిస్తున్నారని ఆయన చెప్పారు. ఒడిశాతో సంబంధం ఉన్న నీటిపారుదల సమస్యలు, నేరడి బ్యారేజ్ వంటి ముఖ్యమైన అంశాల పరిష్కారానికి కేంద్ర స్థాయిలో కృషి చేస్తున్నారని వివరించారు. అదేవిధంగా, జిల్లాకు సేవలందించిన మహనీయుడు, దివంగత నేత కింజరాపు ఎర్రంనాయుడుపై కూడా అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.



## విజ్ఞాన వారోత్సవాలు




**ఇచ్ఛాపురం, మార్చి 10 (వార్త):** ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మండల స్థాయి లో విజ్ఞాన శాస్త్రంలో మహిళల పాత్ర పైన క్విజ్ కాంపిటీషన్ దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్రం యొక్క ప్రాముఖ్యత పై సెమినార్, జూనియర్స్ విభాగంలో (3,4,5) తరగతి వరకు భారతీయ అంతరిక్ష సాంకేతికతపై పోస్టర్ పెయింటింగ్ వివిధ శాస్త్రవేత్తల గూర్చి ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో పోస్టర్ తయారీ పోటీలో మొదటి బహుమతి హర్షిత, ద్వితీయ బహుమతి వాసుదేవ్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో ప్రథమ బహుమతి ప్రణవి, ద్వితీయ బహుమతి శ్రీనిక గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో క్విజ్ కాంపిటీషన్ ప్రథమ బహుమతి ప్రాథమికోన్నత పాఠశాల-బాలకృష్ణాపురం, ద్వితీయ బహుమతి మునిసిపల్ బాలికోన్నత పాఠశాల- ఇచ్ఛాపురం, సెమినార్ విభాగంలో ప్రథమ బహుమతి-జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధర్మపురం, ద్వితీయ బహుమతి మున్సిపల్ బాలికోన్నత పాఠశాల-ఇచ్ఛాపురం గెలుపొందారు. విజేతలు జిల్లా స్థాయిలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే సూర్యారావు, ఎస్.విశ్వనాథం, ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## బాలకృష్ణ ప్రసాద్‌కి నివాళార్చన

**ఇచ్ఛాపురం, మార్చి 10 (వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులు అపర అన్నమయ్యగా గుర్తింపు పొందిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం వెంకటేశ్వర భక్త బృందం చిన్నా గురు స్వామి ఆధ్వర్యంలో చితంబరేశ్వర స్వామి ఆలయ కమిటీ కమిటీ ఆలయ అర్చకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. బాలకృష్ణ ప్రసాద్ గానం చేసిన పలు అన్నమయ్య కీర్తనల పాడి భక్తులను మంత్రముగ్ధులను చేశారు.గాయకులు చిన్నా గురుస్వామి కుమారి కీబోర్డుపై హేమంత్ కుమార్ బాడిత్య తబలాపై జగన్ బాడిత్య నితిన్ బాడిత్య తమ వాయిద్య సహకారాన్ని అందించారు.



# ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించాలి

### -అదనపు ఎస్పీ కె.వి. రమణ



**శ్రీకాకుళం రూరల్, మార్చి 10(వార్త):** వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని, వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలని అదనపు ఎస్పీ కె.వి. రమణ అన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు 14 రోజుల పాటు నిర్వహించిన పునశ్చరణ శిక్షణ (మొబిలైజేషన్) ముగింపు కార్యక్రమం మంగళవారం ఉదయం తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం పరేడ్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు రోజూ నిర్వహించే వివిధ విధులు, ఆయుధాల వినియోగం వంటి అంశాలను ఈ మొబిలైజేషన్ శిక్షణలో భాగంగా పునశ్చరణ చేయడంతో పాటు వాటికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా జోడించామని తెలిపారు. జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం ఎంతో ముఖ్యమైనదని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖకు వెన్నుముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు ప్రతిరోజూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తగిన ఆహారం తీసుకుంటూ శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ మొబిలైజేషన్ (పునశ్చరణ) శిక్షణలో వీఐపీల భద్రత, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్, వ్యక్తిత్వ వికాసం, మస్కట్రీ డ్రిల్, మెడికల్ అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం, రయట్ గేర్ ఆపరేషన్, యోగ, శారీరక దారుఢ్య పరీక్షలు వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకుని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శేషాద్రి, గోవిందరావు, ఆర్ఐ శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 4 కిలోల గంజాయితో యువకుడు అరెస్ట్

**శ్రీకాకుళం క్రైం, మార్చి10 (వార్త):** ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న యువకుడిని మంగళవారం ఎచ్చెర్ల పోలీసులు పట్టుకుని సుమారు 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఎచ్చెర్ల ఎస్ఐ లక్ష్మణరావుకి వచ్చిన సమాచారం మేరకు సింహద్వారం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటాడి పట్టుకున్నారు. పోలీసులు అతడిని విచారించారు. ఒడిశాకు చెందిన శ్రీహరి ప్రధాన్ తన స్వగ్రామమైన మంగల్పూరుకు చెందిన అశోక్ బెహ్రా వద్ద ఈ గంజాయితో కూడిన బ్యాగును తీసుకున్నాడు. ఆ బ్యాగును బెంగళూరులో భరత్ అనే వ్యక్తికి అందజేస్తే రూ.10,000 ఇస్తానని అశోక్ చెప్పాడు. దీంతో శ్రీహరి ప్రధాన్ అందుకు ఒప్పుకుని తన గ్రామం నుండి శ్రీకాకుళం వరకు బస్సులో వచ్చాడు. సింహద్వారం కూడలి వద్ద ట్రావెల్స్ బస్సు ఎక్కి బెంగళూరు వెళ్లేందుకు వేచి ఉండగా, పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు జేఆర్‌పురం సీఐ ఎం అవతారం తెలిపారు.



## 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావదినోత్సవం

**మందస, మార్చి 10(వార్త):** యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్(వైఎస్సార్ కాంగ్రెస్) పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓ ప్రభంజనమన్నారు. సీఎంగా ఆయన చేసిన అభివృద్ధి, పథకాలు కలకాలం గుర్తిండిపోతాయన్నారు. ఈనెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొందామని, 15ఏళ్లు పూర్తి చేసుకుని, 16ఏట అడుగిడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో గత 15 సంవత్సరాలుగా ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ పార్టీ ముందుకు సాగింది. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర వేశారన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికార పార్టీ అప్రజాస్వామిక విధానాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెట్టిన పరిస్థితుల్లో కూడా పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీ చేస్తున్న పోరాటం విశేషమైనదన్నారు. ఈ నేపథ్యంలో 12న(గురువారం) పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గం, ప్రగతి భవన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10గంటలకు పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, అనంతరం అదే ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయబడుతుందన్నారు. మూడు మండలాలు, మున్సిపాలిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న క్యాడర్ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కిషోర్ కుమార్ కోరారు.

### వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

**పలాస, మార్చి 10 (వార్త):** ప్రతినిత్యం ప్రజాపక్షంగా నిలిచే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ ఏటా అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈనెల 12వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా పండగ వలె పలాస నియోజకవర్గంలో నిర్వహించి విజయవంతం చేయాలని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విలువలు.. విశ్వసనీయతే వైఎస్ఆర్సిపి మూల స్తంభాలని, సంక్షేమం.. అభివృద్ధి పార్టీ సిద్ధాంతాలని, ప్రజా పక్షమై పోరాటాలు చేయాలన్నా.. ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలన్నా వైయస్సార్సీపితోనే సాధ్యమన్నారు. ప్రజా ఆకాంక్షల మేరకు ప్రజల గుండెల్లో ఆవిర్భవించిన పార్టీ 15 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించింది అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ దాడులను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తుందని బమ్మిడి దుర్యోధన వివరించారు. ఈ నేపథ్యంలో వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవాన్ని స్ఫూర్తిదాయంగా నిర్వహించాలన్నారు. పలాస నియోజకవర్గం లో రాష్ట్ర మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేర ప్రతి గ్రామం, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ కేంద్రాల లో పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఎగరవేయాలి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించాలన్నారు. పండుగ వాతావరణం లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైయస్ఆర్సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు.

## సృజనాత్మకతకు మరింత పదును పెట్టి రాణించాలి

**మెళియాపుట్టి మార్చి 10 (వార్త):** విద్యార్థులు విద్యార్జనతోపాటు వారిలో ఉన్న సృజనాత్మకతను మరింత పదును పెట్టి వారికి ఆసక్తి గల రంగాలలో మరింత రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించి పది మందికి ఆదర్శం కావాలని మండల విద్యాశాఖ అధికారులు ఎస్ దేవేంద్రరావు, ఎం. పద్మనాభరావులు అన్నారు. మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మెళియాపుట్టి మండలంలో గల కోసమాలలో నున్న జిల్లా పరిషత్,ప్రాథమిక ఉన్నత పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ పెయింటింగ్, ఇండియన్ స్పేస్ టెక్నాలజీ, ఫాన్సీ డ్రెస్, సైంటిస్ట్, క్విజ్, సెమినార్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులతో పాటు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లేగ దూడలు వ్యాధులు పట్ల పోషకులకు అవగాహన ఉండాలి

**సంతబొమ్మాళి, మార్చి 10 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో లక్కివలస గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడలు పోటీ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ సిహెచ్ సత్య ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడలు వ్యాధుల పట్ల ఖచ్చితమైన అవగాహన పశుపోషకులు అందరికీ ఉండాలని సూచించారు. సంతానోత్పత్తికి ఉపయోగపడని పాడి పశువులను పశు వైద్యుల సూచనలు, సలహాలతో వైద్యం చేయించుకుని సంతానానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పాడి పశువుల కొనుగోలు రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల, పశువుల కొనుగోలు చేయడం కష్టమని, అందువలన తమ దగ్గర ఉన్న పశువులనే సంతానానికి పనికి వచ్చే పశువులుగా మార్చుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్క పాడి రైతు పశు వైద్యుల సూచనలు సలహాలు పాటించలన్నారు . ఈ శిబిరంలో 41 లేగ దూడలు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన లేగ దూడలకు బహుమతులు అందించారు . ఈ కార్యక్రమంలో టెక్కలి ఉప సంచాలకులు డాక్టర్ సిహెచ్.నరసింహులు, టెక్కలి సహాయ సంచాలకులు డాక్టర్.బి.వెంకట రమణ, డాక్టర్.కె.జె.చాకవర్తి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వి.డి.కె.కొత్తూరు, టెక్కలి, డా.ఆర్.రాజ్ కిరణ్ రెడ్డి, వీఏఎస్, సంతబొమ్మాళి, డా.జి.గౌతమ్, వీఏఎస్, కొల్లిపాడు. ప్రజాప్రతినిధులు దూపాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు మెరుగుపరచాలి

**శ్రీకాకుళం, మార్చి 10 (వార్త):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నమోదైన నెలవారీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందాల్సిన క్లెయిమ్‌లను పరిశీలించి, వారికి త్వరితగతిన న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని మానసిక చికిత్స విభాగాన్ని సందర్శించి రోగుల పరిస్థితిని సమీక్షించారు. వార్డుల పరిసరాలను పర్యవేక్షించి, పరిశుభ్రతపై వైద్యులకు తగు సూచనలు చేశారు. రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని, వైద్య విధానాల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు.

## బంగారమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం మార్చి 10 (వార్త):** తేలుకుంచికి చెందిన బంగారమ్మ కుమార్తె ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.నిరుపేద కుటుంబం కావడంతో యువభారత్ సేవా ఫౌండేషన్ నుంచి జగన్ సాహు 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

## ఒక్క ఎకరా కూడా ఆంధ్రా భూమికి నష్టం వాటిల్లదు

**ఇచ్ఛాపురం, మార్చి 10 (వార్త):** ఒడిశా భూభాగమైన సున్నాపురం ప్రాంతంలో ఓడరేవు నిర్మాణానికి ఒడిస్సా అదికారులు కోఆర్డినేషన్ 122 కొరకు టెంపరరీ బెంచ్ మార్క్ (టీబీఎం) డ్రోన్ సర్వే చేస్తున్నారే తప్పా ఒడిస్సాకు అనుకుని ఉన్న మండలం పెద్దలక్ష్మీపురం గ్రామ పొలాలు సర్వే చేయటం లేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ ఎన్ వెంకటరావు పెద్దలక్ష్మీపురం గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. పెద్దలక్ష్మీపురం గ్రామ ప్రజలు ఇచ్చిన పిర్యాదు మేరకు మంగళవారం తహశీల్దార్ పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ మీసాల చిన్నమనాయ డు గ్రామంలో గల ఆంధ్రాకు చెందిన పొలాలును పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి దైర్యం చెప్పారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేనిదే ఆంధ్రా భూములు సర్వే చేయలేరని తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని మీ భూములు మీకే సొంతం అని తెలిపారు. ఒడిస్సా భూములు డ్రోన్ సర్వేలో భాగంగానే ఆంధ్రాభూమలుకు ఆనుకొని ఉన్న పెద్దలక్ష్మీపురం పొలాల వైపు వచ్చారే తప్పా ఆంధ్రా పొలాలలను సర్వే చేయటం లేదని తెలిపారు. సమావేశంలోగ్రామస్థులు పాల్గొన్నారు.

## జనసైనికులు ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం మార్చి 10 (వార్త):** లొద్దపుట్టి గ్రామం, పరపటి నూకరాజు అనే యువకుడు ఇటీవలే ప్రమాదానికి గురైన విషయం తెలుసుకుని, లొద్దపుట్టి జనసైనికులు ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి రాజు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి కలిసి 21500 రూపాయలను ఆ కుటుంబానికి అండగా ఆర్థిక సహాయం చేశారు..

## ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి కూలింగ్ సన్ గ్లాసెస్, వైట్ క్యాప్స్

**శ్రీకాకుళం, మార్చి 10 (వార్త)** ట్రాఫిక్ విధుల్లో తీవ్ర ఎండలో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో వరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ సన్ గ్లాసెస్, వైట్ క్యాప్స్ మంగళవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అందవరపు ప్రసాద్. అందవరపు సంతోష్, బెనర్జీ, ట్రాఫిక్ సీఐ వి. రామారావు అందజేశారు. ట్రాఫిక్ విధుల్లో భాగంగా ఎండలో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి అవసరమైన వస్తువులు అందించడం అభినందనీయమని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## మంచినీరు బోరులో కలుషిత నీరు

**పలాస, మార్చి 10 (వార్త):** పలాస మున్సిపాలిటీ పద్మాభపురం కొలని, శివాజీ నగర్ మంచినీరు బోరులో కలుషిత నీరు కలుస్తుందని సమాచారం తెలుసుకున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరిష తక్షణమే మున్సిపాలిటీ కమిషనర్‌తో సంప్రదించి మంగళవారం చర్యలు చెపట్టారు. మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించి మురుగు నీరు చేరకుండా సిబ్బందితో పనులు చేపట్టారు. మంచి నీటి ట్యాంక్ లు ద్వారా ప్రతి ఇంటికి నీటి సరఫరా చేస్తామని, అరుబైట చెత్త వేయరాదని అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న బావిలో క్లోరినేషన్ చేయించారు. స్థానికులు వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరిషకు, మున్సిపాలిటీ కమిషనర్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ఆట స్థలానికి ఆర్థిక సహాయం

**సంతబొమ్మాళి, మార్చి10(వార్త):** పాత మేఘవరం క్రికెట్ గ్రౌండ్ (క్రీడా మైదానం) అభివృద్ధికి వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ రూ. పదివేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన యువకులకు టెక్కలి వైసీపీ కార్యాలయంలో నగదును తిలక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సాహుకారి వసంత్, గాడి గణేష్, జోగారావు, జి.వాసు ఎన్.లక్ష్మణరావు, బి.లక్ష్మణరావు, బి.శివ, ఎస్ కృష్ణ బి.తేజ, ఎస్.సాయి, సిహెచ్.శంకర్ పూజరావు, ఎన్.ఉమా పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546